www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 29 అక్టోబర్ 2023
5
తూర్పుగోదావరి



సిఎస్ పరీక్షను సమర్థవంతంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

నవంబర్ 3న నిర్వహిస్తున్న స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే పరీక్షను సమర్థవంతంగా నిర్వహించాలని అర్బన్ రేంజ్ డిఐ బి.దిలీప్ కుమార్ ఆదేశించారు. స్థానిక ప్రభుత్వ ట్రైనింగ్ కళాశాలలో సీస్ పరీక్షకు ఫీల్డ్ నిర్వాహకులుగా నియమించిన బిఇడి కళాశాల ఛాత్రోపాధ్యాయులతో ప్రత్యేక సమావేశాన్ని శనివారం నిర్వహించి విధి విధానాలను ఆయన వివరించారు. పరీక్ష లక్ష్యం ఇచ్చిన సూచనలను ప్రతి ఒక్కరూ క్షుణ్ణంగా చదివి అర్థం చేసుకోవాలన్నారు. ఎటువంటి సందేహాలున్నా తమను సంప్రదించాలని, ఎట్టి పరిస్థితుల్లో పరీక్ష నిర్వహణలో ఎటువంటి సమస్య రాకుండదన్నారు. పరీక్ష అనంతరం పేకింగ్ చేసే క్రమంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సత్యార్థి, అర్బన్ రేంజ్ ఎంఇఒ -2 రమా రజని, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

కక్షిదారులపై వెల్ఫేర్ భారం..!

- ఇకపై రూ.1తో పాటు రూ.20 వెల్ఫేర్ స్టాంపులు వినియోగించాలి
- ప్రత్యక్షంగా న్యాయవాదులపై, పరోక్షంగా ముద్దాయిలపైనా భారం
- నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్



రిలే నిరాహారదీక్షలో పాల్గొన్న న్యాయవాదులు(ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

కోర్టుల్లో ప్రతి పిటిషన్‌కు రూ.1 స్టాంపుతోపాటు రూ.20ల వెల్ఫేర్ స్టాంపు తప్పనిసరి అంటూ ఎపి బార్ కౌన్సిల్ చేసిన నిర్ణయం అటు న్యాయవాదుల్లోనూ, ముద్దాయిల్లోనూ ఆందోళన వ్యక్తమవుతోంది. ఏదైనా కారణాలతో ముద్దాయి కోర్టుకు హాజరు కాలేనిపక్షంలో ఆప్సెంట్ పిటిషన్‌లను లాయర్లు వేస్తుంటారు. అదేవిధంగా సిఆర్‌ఎల్ ఎంపి, క్రిమినల్ మిసిలియన్స్ పిటిషన్, ఐఎ వంటి పిటిషన్లు తరచూ వేయాల్సి ఉంది. ఇప్పటి వరకూ రూ.1 వెల్ఫేర్ స్టాంపు ఉండేది. అయితే బార్ కౌన్సిల్ ఆఫ్ ఎపి ఇటీవల పిటిషన్లకు రూపాయి స్టాంపునకు బదులు రూ.20 స్టాంపు అతికించాలని ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఒక్కొక్క లాయర్‌పై నెలకు సరాసరిన రూ.2 వేలు నుంచి రూ.3 వేలు వరకూ భారం పడుతుంది.

భారం పడుతుందని ఇలా...

సాధారణంగా బెయిల్ అప్లికేషన్, ప్రతి కొత్త కేసుకు న్యాయవాదులు రూ.100 వెల్ఫేర్ స్టాంపు వినియోగించడం పరిపాటిగా వస్తోంది. తాజా నిర్ణయాన్ని ఈ నెల 16వ తేదీన అమలు చేశారు. కేవలం వారం రోజుల వ్యవధిలో జిల్లాపై రూ. 1 లక్ష భారం పడినట్లు న్యాయవాదులు చెబుతున్నారు. ముద్దాయి కోర్టుకు హాజరు కాలేని కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో ముద్దాయి తరుపున న్యాయవాది కోర్టులో పిటిషన్ వేయాల్సి ఉంది. ప్రస్తుతం స్టేట్ బార్ కౌన్సిల్ నిర్ణయంతో రూ.20 అంటించాల్సి ఉంది. ఇలా ఒక లాయరు ఐదుగురు ముద్దాయిలకు ఆప్సెంట్ పిటిషన్ వేస్తే రూ.20 చొప్పున రూ.100 వెచ్చించాల్సిందే. పాత ధర ప్రకారం రూ.5లతో పిటిషన్లు వేసే వెసులుబాటు ఉండేది. ఈ భారమంతా పరోక్షంగా ముద్దాయిలపై, ప్రత్యక్షంగా న్యాయవాదులపై పడుతోంది. గత కొంతకాలంగా న్యాయవాదుల వెల్ఫేర్ కూడా అమలుకు నోచుకోవడం లేదని తెలుస్తోంది. గతంలో అడ్వకేట్ ఎవరైనా చనిపోతే ప్రభుత్వం నుంచి రూ.4 లక్షలు, బార్ కౌన్సిల్ వెల్ఫేర్ ఫండ్ నుంచి మరో రూ.4 లక్షలు చొప్పున సహాయం అందించేవారు. గత కొంతకాలంగా మృతి చెందిన వారి కుటుంబాలకు ఈ వెల్ఫేర్ ఫండ్ బకాయిలు చెల్లించని పరిస్థితి ఉందని న్యాయవాదులు పేర్కొంటున్నారు.

రూ.20 పెంపు నిర్ణయాన్ని తక్షణమే రద్దు చేయాలి

రూ.1 ఉన్న వెల్ఫేర్ స్టాంపు ధరను స్టేట్ బార్ కౌన్సిల్ రూ.20లకు పెంచి సామాన్యులపై భారం మోపడం తగదు. ఈ నిర్ణయం న్యాయవాదులకు పెనుభారం కానుంది. నెలకు సరాసరిన వేలల్లో భారం పడే అవకాశం ఉంది. న్యాయవాదులను, ముద్దాయిలను ఇబ్బందులకు గురిచేసే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి.

-దాసరి రాంబాబు, న్యాయవాది, రాజమహేంద్రవరం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత, జెసి తేజ్ భరత్

గృహ నిర్మాణాల పూర్తికి చర్యలు

-ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వీడియో కాన్ఫెరెన్స్‌లో కలెక్టర్ వెల్లడి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

గృహ నిర్మాణ ప్రక్రియలో స్టేజి కన్వర్షన్ ప్రాధాన్యత ఇస్తూ రెండో దశలో చేపట్టిన గృహ నిర్మాణాలను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. శనివారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్ రెడ్డి జిల్లా కలెక్టర్‌లతో ఎమ్ఎస్ఎంఇ, హౌసింగ్, రెవెన్యూ రీ సర్వే, జాతీయ రహదారులు, వ్యవసాయం, పంచాయతీ రాజ్‌లో ప్రాధాన్యత భవనాలు, ఉపాధిహామీ, తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్ దృశ్య శ్రవణ సమావేశ మందిరం నుంచి కలెక్టర్ మాధవీలత, జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత జిల్లా ప్రగతిపై మాట్లాడుతూ హౌసింగ్ నిర్మాణాలను వేగవంతం చేసేందుకు వారం వారం లక్ష్యాలను ఇవ్వడం జరిగిందని, రెండో దశలో 19253 ఇళ్ళకి గాను ఈ వారం 2467 స్టేజ్ కన్వర్టింగ్ లక్ష్యాలను ఇవ్వడం జరిగిందని, 73 ఇళ్ళ నిర్మాణాలు లక్ష్యం కాగా 96 ఇళ్లను పూర్తి చేశారన్నారు. స్టేజ్ కన్వర్షన్ పై మరింత దృష్టి పెట్టాలని సూచించారు. మూడోవ దశ రీ సర్వే ప్రక్రియను సజావుగా పూర్తి చేసేందుకు క్షేత్ర స్థాయి అధికారులకు, సిబ్బందికి శిక్షణ ఇవ్వడం జరిగిందని, తొలి రెండు దశల్లో రీ సర్వేలో ఎదుర్కొన్న పలు అంశాలపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్లు జల్ జీవన్ మిషన్ కింద 404 పనులకు రూ.164.34 కోట్లతో 1,63,070 కనెక్షన్స్ ఇచ్చే పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. ప్రతి గ్రామంలో నీటి లభ్యత కింద 39 గ్రామాల్లో నూరుశాతం లక్ష్యాలను సాధించడం జరిగిందన్నారు. ఉపాధిహామీ పంచాయతీ రాజ్ పనుల్లో భాగంగా 373 గ్రామ సచివాలయ భవనాలకుగాను 286 పూర్తి చేశామని, 347 ఆర్‌బికెలకు గాను 238 భవనాలు, 258 వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్స్‌కు గాను 144 పూర్తి చేసినట్లు తెలిపారు. వ్యవసాయ రంగ సమీక్షలో 3,22,959 ఎకరాలకి గాను 3,15,860 ఈ కేవైసి పూర్తి చేసినట్లు, 97.80 శాతం లక్ష్యాలను సాధించడం జరిగిందన్నారు. పిఎం కిసాన్ యోజన కింద అర్హత కలిగిన 97,359 మందికి గాను 96,029 ఈ కేవైసి పూర్తి చేసినట్లు తెలిపారు. జిల్లాలో 100 శాతం ఈ పంట నమోదు చేశామన్నారు. ఉపాధి హామీ పథకం, స్వమిత్వ, రీ సర్వే, తదితర అంశాలపై ప్రధాన కార్యదర్శి కలెక్టర్లకు పలు సూచనలు చేశారు. మల్టీ పర్పస్ ఫెసిలిటీ భవన నిర్మాణాలకు చెంది 53 చోట్ల స్థలాలు గుర్తించడం జరిగిందన్నారు. తదుపరి దశలో ఆయా భవన నిర్మాణాలకు చెందిన కార్యాచరణ ప్రణాళిక లను సిద్ధం చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఒ జి. నరసింహులు, ఎస్ఈ ఎస్‌బివి ప్రసాద్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ డి.బాల శంకర్ రావు, వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు, డ్వామా పిడి పి.జగదాంబ, డిపివో జెవి.సత్యనారాయణ, డిసిఒ వై.ఉమా మహేశ్వర రావు, పశు సంవర్ధక అధికారి డాక్టర్ ఎస్‌జిటి సత్యగోవింద్, హౌసింగ్ పిడి జి.పరశు రామ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఆర్ట్ గ్యాలరీ, ఫుడ్ ఫెస్టివల్

ప్రజాశక్తి - ఉండ్రాజవరం


తినుబండారాలను అమ్మకం చేస్తున్న విద్యార్థులు

అన్నపూర్ణ విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన ఆర్ట్ గ్యాలరీ, ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమం ఆకట్టుకుంది. శనివారం ఏర్పాటుచేసిన ఆర్ట్ గ్యాలరీ, ఫుడ్ ఫెస్టివల్‌లో విద్యాసంస్థల విద్యార్థులు సుమారు 2 వేల మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్‌కెజి నుంచి ఇంటర్మీడియట్ స్థాయి విద్యార్థులు వివిధ రకాల ఆర్టులు, పెయింటింగులు, పరిశోధనలు, నిర్మాణ సామాగ్రి తయారుచేసి, ప్రదర్శించారు. వాటిలో వందే భారత రైలు, అయోధ్య రామాలయం, ఈఫిల్ టవర్, సోలార్ సిస్టం, పలు రకాల చేతి తయారీ వస్తువులు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ప్రయోగశాలలో సైతం చంద్రయాన్ 3, రోబోటిక్స్, ఆర్టిఫిషియల్ ఎయిర్ ప్యూరిఫైయర్, హార్వెస్టర్ ఆక్సిజన్ జనరేటర్, ఆటోమేటిక్ ఆల్కహాలిక్ టెస్ట్ డ్రైవ్ వెహికల్ వంటి పలు రకాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా అన్నపూర్ణ విద్యాసంస్థల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ నందిగం వెంకట సీతారామయ్య. మాట్లాడుతూ విద్యార్థులలో సృజనాత్మకత, భావవ్యక్తీకరణ వంటి లక్షణాలు పెంపొందెందుకు ఇటువంటి ఈవెంట్లు ఉపయోగపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి నందిగం భాస్కర రామయ్య, కఠారి సిద్ధార్థ రాజు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న జెఎఎస్ శిబిరాలు

ప్రజాశక్తి - యంత్రాంగం

తూర్పు గోదావరి జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు కొనసాగుతూనే ఉన్నాయి. పలు మండాల్లోని గ్రామాల్లో శనివారం జరిగిన జెఎఎస్ శిబిరాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, పాల్గొన్నారు. **ఉండ్రాజవరం** మండలంలోని వేలివెన్నులో జెఎఎస్ శిబిరంలో ఎంఎల్ఎ జి.శ్రీనివాస నాయుడు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పాలాటి యల్లారీశ్వరి, జడ్‌పిటిసి నందిగం భాస్కర రామయ్య, పార్టీ నాయకులు కఠారి సిద్ధార్థ రాజు, పాలాటి శరత్, బూరుగుపల్లి బ్రహ్మానందం, తదితరులు పాల్గొన్నారు. **గోకవరం** మండలంలోని అచ్యుతాపురం గ్రామంలో గ్రామ సర్పంచ్ బత్తుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జెఎఎస్ శిబిరం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ జ్యోతుల చంటిబాబు పాల్గొని రోగులకు ఉచితంగా మందులను అందించారు. అలాగే గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు డి.రమేష్, ఎస్. వీరబాబు, ఎన్.నరసయ్య, ఎన్.బుజ్జి, ఎన్.వెంకన్న బాబు, కె.అచ్చి బాబు, ఎంపిడిఒ కె.పద్మజ్యోతి, సూపరవైజర్ రంజిని పాల్గొన్నారు. **సీతానగరం.**మండలంలోని మిర్తిపాడు సచివాలయంలో జెఎఎస్ శిబిరం డాక్టర్ రాజు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా రోగులకు వైద్య సేవలందించారు. వైద్యులు డాక్టర్ యేసురాణి, డాక్టర్ మేఘన, పంచాయతీ కార్యదర్శి విజయ, సర్పంచ్ సత్యవతి, ఉప సర్పంచ్ రామకృష్ణ, ఎంపిటిసి మాకిరెడ్డి దేవి, తదితరులు పాల్గొన్నారు.



టిడిపి సీనియర్ నాయకుడు నరసయ్య మృతి

ప్రజాశక్తి - గోకవరం

మండలంలోని తంటికొండ గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకుడు పల్లా నరసయ్య (61) శనివారం మృతి చెందారు. టిడిపి ఆవిర్భావం నుంచి పార్టీలో కొనసాగిన దళిత నాయకుడు పల్లా నరసయ్య మండలంలో పార్టీ అభివృద్ధికి విశేషంగా కృషి చేశారు. పార్టీలో పలు ఉన్నత పదవులు నిర్వహించిన పల్లా నరసయ్య అకాల మృతి పట్ల వైసిపి నాయకులు డి.రమేష్, ఎస్.వీరబాబు, బి.రాంబాబు, ఎం.మైనర్ బాబు, బి.బాబి, బి.అచ్చన్నదొర, జి.భరత్, తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

కార్మికునికి గోరంట్ల సాయం

ప్రజాశక్తి - కడియం

మండలంలోని పొట్టిలంక గ్రామనికి చెందిన లివర్ వ్యాధితో బాధపడుతున్న చేనేత కార్మికుడు చందన బసవ లింగంకు ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి రూ.20 వేల ఆర్థిక సాయాన్ని ఆయన స్వగృహంలో శనివారం అందించారు. తదుపరి ఏ సహాయసహకారాలు కావాలన్నా నేరుగా తనను సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలిదిండి సత్యనారాయణ, కొత్తపల్లి శ్రీరామ్, హరికృష్ణ, మాడ సత్యనారాయణ, బూడిద సత్యనారాయణ, మాడ రామచంద్రరావు, మాడ మల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమావేశం


కేక్‌ను కట్ చేస్తున్న విశ్రాంత ఉద్యోగులు

ప్రజాశక్తి - చాగల్లు

మండల ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ సమావేశం శనివారం అంబేద్కర్ రీడింగ్ భవనంలో సంఘం అధ్యక్షులు కోడి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో జనవరి, ఫిబ్రవరి నెలల్లో లైఫ్ సర్టిఫికేట్స్ సంబంధిత ట్రజరీల్లో అందజేయాలని తెలిపారు. సమావేశంలో సభ్యుల జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సమావేశంలో డి.నాగేశ్వరరావు, కెఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు..

రైఫిల్ షూటింగ్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి - రాజానగరం


రైఫిల్ షూటింగ్ చేస్తున్న క్రీడాకారులు

మండల పరిధి లోని సంపత్‌నగరంలో రాజమహేంద్రి ఇంటర్నేషనల్ పాఠశాలలో శనివారం ఎపి అంతర్ జిల్లాల ఎస్‌జిఎఫ్ రైఫిల్ షూటింగ్ టోర్నమెంటు ప్రారంభం అయ్యింది. ఈ కార్యక్రమానికి డివైఇఒ ఇ.నారాయణ అధ్యక్షత వహించగా, సాప్ డైరెక్టర్ భీమిరెడ్డి నాగేంద్రుడు, డివైఇఒ కప్పల వరలక్ష్మి, ఎంఇఒలు జెవిఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, ఎం.రామన్నదొర, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు లంక జార్జ్, జిల్లా అధ్యక్షులు వి.రవిరాజ్, జిల్లా ఎస్‌జిఎస్ సెక్రటరీ ఎస్ఆర్‌కెవి స్వామి, రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్ ఛైర్మన్ టికె విశ్వేశ్వర రెడ్డి, డైరెక్టర్ టి.స్వరూప్ రెడ్డి పాల్గొన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో వివిధ జిల్లాలకు చెందిన సుమారు 500 మంది క్రీడాకారులు మరియు వ్యాయామ ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచే క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధిస్తారని ఎస్‌జిఎఫ్ సెక్రటరీ కెవి స్వామి తెలిపారు.

నూతన కార్యవర్గం ఏకగ్రీవం

ప్రజాశక్తి - గోకవరం

మండల ఫోటో, వీడియో గ్రాఫర్ల నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎంపికయ్యింది. మండల గౌరవ అధ్యక్షులుగా బాలు, గంధం బాబురావు, గౌరవ సలహాదారులుగా తోలేటి రాంప్రసాద్, పల్లెల కొండలరావు, మండలం అధ్యక్షులుగా సన్నపు శాంతి బాబు, ఉపాధ్యక్షులుగా శివ, కార్యదర్శిగా చిన్న లావయ్య, ట్రెజరర్‌గా దుర్గ, సహాయ కార్యదర్శిగా రత్నరాజు, కార్యవర్గసభ్యులు ఏకగ్రీవంగా ఎంపిక అయ్యారు. ఈ నూతన కార్యవర్గ సభ్యులకు శనివారం తూర్పుగోదావరి జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు కొన్ని శ్రీను ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం కార్యక్రమ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ సెక్రటరీ ఫణి, శ్రీనివాస్, శ్రీను, లీలా నాగు, ఎ.రాంబాబు, ప్రభాకర్ రావు, కె.శివరామకృష్ణ, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం, చాగల్లు


వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్‌పి

వాల్మీకి మహర్షి జయంతి కార్యక్రమాన్ని జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్‌పి పి.జగదీష్ వాల్మీకి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ వాల్మీకి సంస్కృత సాహిత్యంలో పేరు గాంచిన కవిగా గుర్తించబడ్డారని, సంస్కృత భాషలో ఇతిహాసమైన రామాయణాన్ని రచించి, సంస్కృత భాషకు ఆదికవిగా గౌరవించబడ్డారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు ఎస్ఆర్ రాజశేఖర్ రాజు, ఎం రజిని, జి. వెంకటేశ్వరరావు, డి రామ వర్మ, శ్రీనివాస్, సంజీవ్ కుమార్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. చాగల్లు మండలంలోని చంద్రవరం శాఖ గ్రంథాలయంలో మహర్షి వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి గ్రంథాలయ అధికారి కె.సుమన్ కుమార్, హెచ్ఎం ఆర్.రమాంబా పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ రామాయణాన్ని రచించిన సంస్కృత ఆది కవి వాల్మీకి అని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ పాఠకులు, ఎల్.ధనుష్, ఎ.సంతోష్, ఎ.ముఖర్జీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈ పంటపై సామాజిక తనిఖీ

ప్రజాశక్తి - గోకవరం

మండల కేంద్రమైన గోకవరం ఆర్‌బికె వద్ద శనివారం రైతులకు ఈ పంటపై సామాజిక తనిఖీ గ్రామ సభ నిర్వహించారు. ఈ గ్రామ సభలో వ్యవసాయ శాఖ సహాయ సిబ్బంది మాట్లాడుతూ ఈ పంట నమోదు అయిన రైతుల తుది జాబితా ఈనెల 26 నుంచి 29 వరకూ అన్ని ఆర్‌బికె లలో ప్రదర్శించడం జరిగిందని తెలిపారు.ఆర్‌బికె సిబ్బంది సామాజిక తనిఖీ గ్రామసభ నిర్వహించి రైతుల పేర్లు వారి పంట వివరాలను చదివి వినిపించారని తెలిపారు. ఏమైనా పొరపాట్లు ఉంటే రైతులు ఆర్‌బికె సిబ్బందితో గ్రీవెన్స్‌లో పెట్టుకుని సరి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

దేవి సెంటర్‌లో భారీ అన్నదానం

ప్రజాశక్తి - కడియం

మండలంలోని దుళ్ల దేవిసెంటర్‌లో శనివారం భారీ అన్న సమారాధన కార్యక్రమం జరిగింది. శ్రీదేవి అమ్మవారి 47వ వార్షికోత్సవ, నవరాత్రి ఉత్సవాలు ముగింపు సందర్భంగా జరిగిన ఈ అన్న సమారాధనలో పరిసర గ్రామాల భక్తులు వేలాది మంది తరలి వచ్చి అమ్మవారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొండపల్లి పట్టియ్య, తాతపూడి బాబీ, ఉప సర్పంచ్ తోకల శ్రీనివాస్, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు తణుకులో మాలల సమ్మేళనం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మాల ఐక్యవేదిక తొమ్మిదవ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం తణుకులో నిర్వహించనున్న మాలల ఆత్మీయ సమ్మేళనానికి మండల ప్రజలు భారీగా తరలిరావాలని మాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షులు తిర్రే రవిదేవా శనివారం ఒక ప్రకటనలో కోరారు. పార్టీలకు అతీతంగా మాల సామాజికవర్గానికి చెందిన ప్రతి ఒక్కరు తప్పనిసరిగా హాజరవ్వాలని ఆయన కోరారు. తణుకు పట్టణం, హౌసింగ్ బోర్డ్ కాలనీ అంబేద్కర్ భవనంలో నిర్వహించనున్న సమ్మేళనానికి మాల మహానాడు జాతీయ అధ్యక్షులు అద్దంకి దయాకర్, మాజీ ఎంపి జివి హర్ష కుమార్, సమత సైనిక్ దళ్ సౌత్ ఇండియా అధ్యక్షులు షాన్ రెంజర్ల రాజేష్, మాల మహానాడు నాయకులు అన్నవరపు కిషోర్, సిద్ధాంతల కొండబాబు, మాల మహానాడు జాతీయ అధ్యక్షులు అలగా రవికుమార్ తదితరులు పాల్గొంటారని తెలిపారు.

సిసి రహదారి, డ్రైనేజీ ప్రారంభం

ప్రజాశక్తి - గోపాలపురం

మండలంలోని కరగ పాడు గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించిన సిసి రోడ్డు, డ్రైనేజ్‌ను ఎంఎల్ఎ తలారి వెంకట్రావు శనివారం ప్రారంభించారు. సర్పం చ్ బొమ్మిన నాగలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వంలో గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు రూ.20 లక్షలను కేటాయించి పనులను చేపట్టినట్లు తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకం అమలు చేస్తూ గ్రామాల అభివృద్ధికి సిఎం జగన్ కృషి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఉండవల్లి సత్యనారాయణ, జడ్‌పిటిసి కాకులపాటి లలిత, నాయకులు బొమ్మిన నాగరాజు, తహాశీల్దార్ రవీంద్రనాథ్, ఎంపిడిఒ ఆర్.శ్రీదేవి, దొడిగర్ల రామారావు, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

సిఎస్ఐఆర్‌తో నన్నయ వర్సిటీ ఎంఒయు


ప్రజాశక్తి - రాజానగరం

మైసూరుకు చెందిన కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సిఎస్ఐఆర్), సెంట్రల్ ఫుడ్ టెక్నలాజికల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ (సిఎఫ్‌టిఆర్ఐ) సంస్థలతో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. శనివారం యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఎంఒయు కార్యక్రమంలో విసి కె.పద్మరాజు, డాక్టర్ వైఎస్ఆర్ హార్టికల్చర్ యూనివర్సిటీ విసి తోలేటి జానకిరామ్, సిఎస్ఐఆర్, సిఎఫ్‌టిఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ శ్రీదేవి అన్నపూర్ణ సింగ్, రిజిస్ట్రార్ జి.సుధాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విసి కె.పద్మరాజు మాట్లాడుతూ మైసూర్‌లోని సిఎఫ్‌టిఆర్ఐ వంటి ప్రముఖ సంస్థలలో ఎంఒయు ద్వారా రెండు సంవత్సరాల ఎంఎస్‌సి ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కోర్సుకు మార్గనిర్దేశం చేయడం, ప్రోగ్రామ్ రూపకల్పన కోసం నిపుణులను బిఒఎస్‌కి నామినేట్ చేయడం, అతిథి ఉపన్యాసాలను నిర్వహించడం, చెల్లింపు ప్రాతిపదికన విద్యార్థులకు ప్రాజెక్ట్ వర్క్‌ను ఆఫర్ చేయడం వంటి ప్రయోజనాలు అందుతాయన్నారు. హార్టికల్చర్ యూనివర్సిటీ విసి తోలేటి జానకిరామ్ మాట్లాడుతూ హార్టికల్చర్ యూనివర్సిటీ ఆవిర్భావం, వికాసాలను వివరించారు. సిఎస్ఐఆర్, సిఎఫ్‌టిఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ శ్రీదేవి అన్నపూర్ణ సింగ్ మాట్లాడుతూ ఆదికవి నన్నయ యూనివర్సిటీతో ఎంవోయు కుదుర్చుకోవడం ఆనందంగా ఉందన్నారు. అవగాహన ఒప్పందాలపై శ్రీదేవి అన్నపూర్ణ సింగ్, రిజిస్ట్రార్ జి.సుధాకర్‌లు సంతకాలు చేసి వీసీ ఆచార్య కె.పద్మరాజు సమక్షంలో ఎంవోయు పత్రాలను మార్చుకున్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, అనుబంధ కళాశాలల అధ్యాపకులు విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న నన్నయ రిజిస్ట్రార్ సుధాకర్

కార్టూ'నిజం'



మన ఓటర్లు.. ఆ జాబితాలోకి రారు కద్సార్..!!

'టిడిపి- జనసేన విజయం ఖాయం'

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంఎల్‌సి ఆదిరెడ్డి

రాబోయే ఎన్నికల్లో టిడిపి-జనసేన కూటమి విజయం ఖాయమని పలువురు టిడిపి నాయకులు అభిప్రాయపడ్డారు. స్థానిక హోటల్ జగదీశ్వరిలో అర్బన్ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం టిడిపి నగర అధ్యక్షుడు రెడ్డి మణేశ్వరరావు అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సందర్భంగా టిడిపి నాయకులు ఆదిరెడ్డి అప్పారావు, గన్ని కృష్ణ, ఆదిరెడి వాసు, నియోజకవర్గ పరిశీలకురాలు చిల్లా జగదీశ్వరి మాట్లాడారు. జగన్ పాలనలో రాష్ట్రంలో హింస, అరాచకం చూస్తున్న ప్రజలు వచ్చే ఎన్నికల్లో ఎవరికి ఓటు వేయాలన్నది ఇప్పటి ఒక నిర్ణయానికి వచ్చేసారని తెలిపారు. ఎన్‌టిఆర్ తెలుగు ప్రజలకు ఆత్మగౌరవం తీసుకొస్తే, చంద్రబాబు ఆత్మ విశ్వాసం తెచ్చారని అన్నారు. చంద్రబాబు ప్రజల కోసం పోరాడే నాయకుడని స్పష్టం చేశారు. రాష్ట్రాభివృద్ధి కోసమే నిరంతరం పరితపించడం చంద్రబాబు చేసిన తప్పా? అని ప్రశ్నించారు. 48 ఏళ్లుగా రాష్ట్రం కోసం కష్టపడడం, నిరుద్యోగులకు ఉద్యోగాలు తీసుకురావడం, ఐటీ రంగాన్ని, అమరావతిని రాజధానిగా అభివద్ధి చేయడం తప్పా? వీటిలో ఆయన చేసిన తప్పులేంటో చెప్పాలన్నారు. ఏ తప్పు చేయని తమ నాయకుడు చంద్రబాబు త్వరలోనే జైలు నుంచి కడిగిన ముత్యంలా బయటకు వస్తారని ధీమా వ్యక్తం చేశారు. చంద్రబాబు జైలులో ఉన్నప్పటికీ ప్రజలకు ధైర్యం చెప్పేందుకు ఆయన కుటుంబ సభ్యులు ప్రజల్లో తిరుగుతున్నారని, మనమంతా అండగా ఉండాలన్నారు. రాష్ట్రంలో సైకో పాలనకు చరమగీతం పాడేందుకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికల్లో టిడిపి-జనసేన కూటమి విజయకేతనం ఎగురవేసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ధీమాను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు యర్రా వేణు, వర్రే శ్రీనివాసరావు, రెడ్డి రాజు, దొండపాటి సత్యంబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - కొవ్వూరు రూరల్, కడియం


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి

సంక్షేమ పథకాలను నేరుగా లబ్దిదారుని ఇంటికే అందిస్తున్న ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందని హోంమంత్రి డాక్టర్ తానేటి వనిత అన్నారు. శనివారం స్థానిక లిటరరీ క్లబ్‌లో ఎపికి జగనే ఎందుకు కావాలి? అనే అంశంపై పట్టణ పరిధిలోని ప్రజా ప్రతినిధుల, నాయకుల, కన్వీనర్ల, గహసారథుల, వాలంటీర్లతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ కుల, మత, పార్టీలకు అతీతంగా నవరత్నాల పథకాలను ప్రతిఇంటికీ అందించారన్నారు. జగనన్న పాద యాత్ర సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశారని తెలిపారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ప్రతి కుటుంబానికి నేడు ఆర్థిక చేయూత లభించిందన్నారు. గత ప్రభుత్వానికి, జగనన్న ప్రభుత్వానికి మధ్య ఉన్న తేడాలేంటి..? పారదర్శక పాలన, సంక్షేమ పాలన తదితర అంశాలపై నాయకులు, గహసారథులు, వాలంటీర్స్, అంతా కలిసి ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలన్నారు. కడియంలో ఎపికి జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రూరల్ నియోజకవర్గ వైసిపి కో-ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ పాల్గొని మాట్లాడారు. ఇంటి వద్దకే సంక్షేమ ఫలాలు అందించినందుకు జగనే కావాలని ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గిరజాల బాబు, తాడాల చక్రవర్తి, వై.స్టాలిన్, డాక్టర్ వెంకటాచలం, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు


సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి

బాలునిపై లైంగిక దాడి కేసులో నిందితుని అరెస్టు

ప్రజాశక్తి - మండపేట

నాలుగేళ్ల బాలుడిని ఆడించే నెపంతో దగ్గరకు తీసుకుని అసభ్యకరంగా వ్యవహరించిన నాయుడు శ్రీనును పోలీసులు అరెస్టు చేశారు. మున్సిపల్ కార్యాలయంలో రికార్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న నాయుడు శ్రీను ఈ నెల 23న సైదులుపేట ఏరియాలో 4 ఏళ్ల బాలుడి పట్ల అసభ్యకరంగా వ్యవహరించిన సంఘటనపై బాలుడు తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో నిందుతుడైన నాయుడు శ్రీనును శనివారం ఆలమూరు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా అతనికి కోర్టు రిమాండ్ విధించిందని కోనసీమ దిశా పోలీస్‌స్టేషన్ డిఎస్‌పి సుంకర మురళీమోహన్ తెలిపారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో పట్టణ ఎస్‌ఐ అశోక్, దిశ ఎస్‌ఐ పాల్గొన్నారు.


,బీమా నగదు అందజేసిన నాయకులు

వైఎస్‌ఆర్ బీమా అందజేత

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

భీమనపల్లి పంచాయతీ సూదాపాలెంలో సహజ మరణం పొందిన వ్యక్తి కుటుంబానికి శనివారం సర్పంచ్ పెయ్యల రాజ్ కుమార్ ఆధ్వర్యంలో సొసైటీ అధ్యక్షులు శిరంగు సత్తిరాజు వై ఎస్ ఆర్ బీమా పథకాన్ని అందజేశారు. గ్రామానికి చెందిన బంధన నాగమణి అనారోగ్యంతో మతి చెందగా ఆమె తల్లి రంగమ్మకు బీమా మొత్తం రూ.లక్ష కాగా తక్షణ సాయం కింద రూ.10 వేలు నగదును అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి శిరంగు సత్తిరాజు, వ్యవసాయ సలహా మండలి సభ్యులు రాయపురెడ్డి నాగు, సచివాలయ కన్వీనర్ మెండి రమేష్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

జిల్లా క్రికెట్ జట్టుకు విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

భీమనపల్లి శిరంగు రంగనాయకమ్మ జెడ్‌పి ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఆకేటి వెంకట శ్రీరవితేజ అండర్ 14 విభాగంలో నార్త్ జోన్ క్రికెట్ పోటీల్లో జిల్లా జట్టుకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా ఆ పాఠశాలలో శనివారం హెచ్‌ఎం ఎన్.సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన అభినందన సభలో వెంకట రవితేజను ఉపాధ్యాయులు విద్యార్థులు అభినందించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ శిరంగు సత్తిరాజు, పిఎంసి చైర్మన్ సబ్బతి జ్యోతి, జిల్లా క్రికెట్ కోచ్ మట్ట సత్తిబాబు, పీడీలు కామన మధుసూదనరావు, కరాటం ప్రసాద్, ఉపాధ్యాయులు ఆర్. వెంకటేశ్వరరావు, ఆరవ నాయుడు, పద్మనాభన్ తదితరులు ఉన్నారు.


సమావేశానికి హాజరైన ఎంఎల్‌సి బొమ్మి ఇజ్రాయిల్

డిసెంబర్ 11న మాదిగ ఉపకులాల రాజకీయ ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

డిసెంబర్ 11న అమలాపురంలో మాదిగ, మాదిగ ఉపకులాల రాజకీయ ఆత్మీయ కలయిక నిర్వహిస్తున్నట్లు మాదిగల పొలిటికల్ జెఎసి చైర్మన్, ఎంఎల్‌సి బొమ్మి ఇజ్రాయిల్ తెలిపారు. శనివారం అమలాపురం రూరల్, నడిపూడి బాబు జగజ్జీవన్ రావు కమ్యూనిటీ హాలులో జిల్లాలోనీ 16 మండలాల మాదిగ నాయకులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఇజ్రాయిల్ మాట్లాడుతూ డిసెంబర్ 11న లక్ష మందితో సభ నిర్వహిస్తామని, ఈ సభకు రాష్ట్రంలో ఉన్న అధికార పార్టీ మాదిగ మంత్రులు, ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలతో పాటు ప్రతిపక్ష పార్టీల మాదిగ నాయకులను కార్యక్రమానికి పిలుస్తామన్నారు. మాదిగ, మాదిగ ఉపకులాల ప్రజలు మహిళలతో సహా అందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో యార్లగడ్డ సత్తిబాబు, మల్లిపూడి రాజు, ఆకుమర్తి రమేష్, చాట్ల రామారావు, యు నాగబాబు, క్రాప నాగభూషణం, మడికి శ్రీరాములు, యార్లగడ్డ రవీంద్ర,ఆకుమర్తి మోహన్, వివిధ మండలాల నుండి మాదిగ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

యానాం వార్తలు

మట్టిని తీసుకుని ఢిల్లీకి పయనం

ప్రజాశక్తి - యానాం

సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ఈ నెల 30న ఢిల్లీలో నిర్మించనున్న అమరవీరుల స్థూపం తయారీకి యానాంలోని వివిధ ప్రాంతాల నుంచి సేకరించిన మట్టిని బిందెతో తీసుకుని నెహ్రూ యువకేంద్రం కార్యకర్త లంక వినయ్ బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఎన్‌ఐకె యువజనాధికారి టి. గోపి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 29 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి సేకరించిన మట్టి, బియ్యం తీసుకుని యానాంతోపాటు పుదుచ్చేరి, కారైకాల్, మాహే నుంచి ప్రతినిధులు వెళుతున్నారని తెలిపారు.

మాజీ నాయకుని అసత్య ప్రచారాన్ని నమ్మకండి

ప్రజాశక్తి - యానాం

రాజీవ్ బీచ్‌ను ఆనుకుని ఉన్న ప్రాంతాల్లోని గృహాలను కూల్చేస్తారని మాజీ నాయకుడు చేస్తున్న అసత్య ప్రచారాన్ని నమ్మవద్దని ఎంఎల్‌ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ అన్నారు. ఫ్లడ్ ప్రోన్ ఏరియాలో గృహాలను సోమవారంలోగా కూల్చేస్తామని ఆ మాజీ నాయకుడు చేస్తున్న ప్రచారంను పలువురు తన దృష్టికి తీసుకొచ్చారని, దీనిపై స్పందించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధిగా నాపై ఉందన్నారు. ఒక వేళ కూల్చి వేత ఆలోచన ప్రభుత్వం చేస్తే ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేసేందుకు వెనుకాడే ప్రసక్తే లేదని అన్నారు. ఏదేమైనా మాజీ నాయకుడు చేస్తున్న అసత్య ప్రచారంను నమ్మ వద్దని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నీచ రాజకీయాలు కోసం ప్రజల్ని బలిచేస్తా అంటే తాను సహించేది లేదని, ప్రజల్లో అపోహలు సృష్టించి తన గుమ్మం చుట్టూ తిప్పించుకోవడానికి ఆ మాజీ నాయకుడు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నాడని దుయ్యబట్టారు. అసత్య ప్రచారాలు మనుకోపోతే వచ్చే ఎన్నికలలో ప్రజలు దేనితో బుద్ధి చెప్పాలో బాగా తెలుసునని, ఏ ఒక్కరూ కూడా అధైర్య పడవద్దని ఎంఎల్‌ఎ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

గణపతి నగర్‌లో భారీ అన్నదానం

ప్రజాశక్తి - యానాం

దేవీ నవరాత్రులు ముగించుకుని స్థానిక మెట్టకూరు, గణపతి నగర్ వద్ద వేంచేసి ఉన్న శ్రీ విజయదుర్గా ఆలయం వద్ద శనివారం భారీ అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పాల్గొని అన్న ప్రసాద వితరణ చేశారు. ఆలయ అభివద్ధి కొరకు రూ.1.25 లక్షలను దేవాలయ కమిటీకి అందచేశారు. ముందుగా కమిటీ సభ్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి - యానాం


ఆక్రమణలు తొలగిస్తున్న అధికారులు

జాతీయ రహదారి 216 సర్వీస్ రోడ్డులో ఇరువైపులా ఉన్న ఆక్రమణలను అధికారులు తొలగించారు. స్థానిక యానం రెవెన్యూ పరిధిలోని జాతీయ రహదారిని అనుకుని ఎన్‌హెచ్ స్థలంలో పలువురు ఆక్రమించి వివిధ రకాల వ్యాపారాలు సాగిస్తున్నారు. దీనిపై వచ్చిన ఫిర్యాదులపై పలువురు వ్యాపారులకు గత ఆరు నెలలుగా జాతీయ రహదారి భద్రత, పర్యవేక్షణ ప్రతినిధులు నోటీసులు జారీ చేశారు. అయినా వారి నుంచి స్పందన లేకపోవడంతో శనివారం ఉదయం పోలీసులు, రెవెన్యూ అధికారులు సహాయ సహకారాలతో జాతీయ రహదారి పర్యవేక్షణ ప్రతినిధులు ఆక్రమణలను తొలగించారు. ఈ కార్యక్రమంలో సిఐ షణ్ముగం, ఎస్‌ఐలు పూవ్వల వీరభద్ర స్వామి, శేరు నూకరాజు, కట్టా సుబ్బరాజు, కాళే సుబ్రహ్మణ్యం తదితర పోలీస్ సిబ్బందితోపాటు డిప్యూటీ తహాశీల్దార, విఎఒలు, సర్వే అధికారులు, ఎన్‌హెచ్ అధికారి శ్రీరామ్, తదితరులు పాల్గొన్నారు.


మండపేటలో మృతి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎంఎల్‌సి తోట తదితరులు

బాధిత కుటుంబాలను పరామర్శ

ప్రజాశక్తి-మండపేట

స్థానిక సత్య శ్రీ రోడ్డులోని కోళ్ల ఫారం వద్ద శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో బాలుడు కొనే మహేష్ మృతి చెందాడు. మృతుని కుటుంబాన్ని, విశాఖపట్నంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన స్థానిక 20వ వార్డు గొల్లపుంతకు చెందిన కాపవరపు శ్యామ్ రాజ్ కుటుంబాన్ని ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు, మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణిలు శనివారం పరామర్శించారు. అన్ని విధాల కుటుంబాలను ఆదుకుంటామన్నారు. వీరివెంట టౌన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, షేక్&షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ అలీఖాన్ బాబా, కౌన్సిలర్ నీలం దుర్గ, వైసిపి నాయకులు శెట్టి నాగేశ్వరరావు, యాదగని చంటి, కాలనీ వాసులు తదితరులు ఉన్నారు. **కపిలేశ్వరపురం** మండలంలో ఇటీవల మృతి చెందిన పలువురు కుటుంబ సభ్యులను శనివారం ఎంఎల్‌ఎ వేగుళ్ల జోగేశ్వరరావు పరామర్శించారు. నేలటూరులో దోర విజయ్ కుమార్ కుటుంబ సభ్యులను, వల్లూరులో పాలచర్ల సత్యవతి కుటుంబ సభ్యులను, నల్లూరులో నరాల జగదీష్, గుత్తుల అప్పారావు, వాసంశెట్టి మంగాయమ్మ కుటుంబ సభ్యులను ఎంఎల్‌ఎ వేగుళ్ల పరామర్శించారు. ఎంఎల్‌ఎ వెంట కాశిన కాశీ విశ్వనాధం, గుబ్బల సూరిపండు, వాసా సత్తిబాబు తదితరులు ఉన్నారు.


కనకసుందరరెడ్డి సంతాప సభలో పాల్గొన్న ఎంఎల్‌ఎ వేగుళ్ల తదితరులు

కనకసుందరరెడ్డి సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి-మండపేట

అర్తమూరు మాజీ ఉప సర్పంచ్ కనకసుందరరెడ్డి సేవలు చిరస్మరణీయమని ఎంఎల్‌ఎ వేగుళ్ల జోగేశ్వరావు అన్నారు. శనివారం గ్రామంలో మాజీ ఉప సర్పంచ్ కనకసుందరరెడ్డి సంతాప సభ పెద్దనూతి సెంటర్ వద్ద జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఎంఎల్‌ఎ వేగుళ్ల, వెంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ మాజీ మెంబర్ పడాల సుబ్బారెడ్డి, గ్రామ ఉప సర్పంచ్ కర్రి సత్యనారాయణ రెడ్డి తదితరులు తొలుత కనకసుందరరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు చిర్ల వెంకటరెడ్డి, చిర్ల బాబులురెడ్డి, నల్లమిల్లి శ్రీహరి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి

ప్రజాశక్తి-యంత్రాంగం

రామాయణం రచయిత వాల్మీకి మహర్షి జయంతినిశనివారం ఘనంగా నిర్వహించారు. **అమలాపురం** స్థానిక కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, సిబ్బందితో కలిసి అధికారికంగా వాల్మీకి జయంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. వాల్మీకి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. **రామచంద్రపురం** వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించాలని సిఎం జగన్ ఆదేశించారని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి వేణుగోపాలకష్ణ తెలిపారు. ఆయన క్యాంపు కార్యాలయం లో వాల్మీకి మహర్షి జయంతి నిర్వహించారు. **మామిడికుదురు** వాల్మీకి మహర్షి జయంతిని మామిడికుదురులో శనివారం ఘనంగా నిర్వహించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి-కాకినాడ

స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించినట్లు ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిబిఎస్.నాయుడు తెలిపారు. పోలీసు అమరవీరుల వారోత్సవాలలో భాగంగా ఎస్‌పి ఎస్.సతీష్ కుమార్ ఆదేశాల మేరకు ఆదిత్య డిగ్రీ కళాశాలలో జిల్లా పరిధిలోని పలు కళాశాలలు, పాఠశాల విద్యార్థులకు 'మహిళలు, బాలికలపై లైంగిక వేధింపుల నుంచి రక్షణ-సమాజ పాత్ర' అనే అంశంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులను జిల్లా స్థాయికి ఎంపిక చేసి జిల్లాస్థాయిలో ఆదిత్య డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. విజేతలకు ఎస్‌పి సతీష్ కుమార్ ప్రశంసాపత్రాలు, నగదు బహుమతులు అందజేస్తామని ఎఎస్‌పి శ్రీనివాస్ తెలిపారు.

నేడు యుటిఎఫ్ కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - తాళ్లరేవు

తాళ్లరేవు హైస్కూల్లో యుటిఎఫ్ మండల కౌన్సిల్ సమావేశం ఆదివారం ఉదయం 9 గంటల నుంచి నిర్వహించనున్నట్లు మండల శాఖ అధ్యక్షుడు ఎం.తాతారావు తెలిపారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు (ఐవి) పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అందరూ తప్పక పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

బాలరామపురం సర్పంచ్ తాతాజీ మృతి

ప్రజాశక్తి - రౌతులపూడి

మండలంలోని బలరామపురం సర్పంచ్ దాసరి సన్యాసి (తాతాజీ) (38) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. సర్పంచ్ సన్యాసి మృతితో బలరామపురంలో విషాదఛాయలు అలుముకున్నాయి. వివిధ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు తరలి వచ్చి తాతాజీకి నివాళులు అర్పించారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

ప్రజాశక్తి-గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.రవిశంకర్ 60వ పుట్టినరోజు సందర్భంగా శనివారం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యాన విద్యార్థులు క్యాంపస్‌లో మొక్కలు నాటారు. ప్రిన్సిపల్ రవిశంకర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ పుట్టిన రోజు, పెళ్లి రోజు వంటి ప్రత్యేక దినాల్లో పర్యావరణ హితంగా మొక్కలు నాటాలన్నారు. ఆదిత్య కన్స్ట్రక్షన్ విభాగం డైరెక్టర్ మేడపాటి భాస్కర చంద్రారెడ్డి, ఆదిత్య విద్యాసంస్థల వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్.సతీష్ రెడ్డి, ప్రిన్సిపల్స్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, డాక్టర్ డోలా సంజయ్, డాక్టర్ ఆదిరెడ్డి రమేష్, డాక్టర్ డి.సతీష్ కుమార్, డాక్టర్ సంజయ్ కుమార్, ఎస్‌టివి.ఎస్.కుమార్, తోటకూర గంగాధర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

డ్వాక్రా మహిళలకు ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను, ఆర్థిక సహకారాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు, వైస్ చైర్మన్లు నెక్కంటి సాయిప్రసాద్, కనకాల మహాలక్ష్మి అన్నారు. శనివారం మున్సిపల్ కమిషనర్ జె.సురేంద్ర పర్యవేక్షణలో మెప్మా ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల సభ్యులు మున్సిపల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన మెప్మా అర్బన్ మార్కెట్‌ను వారు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ మెప్మా సహాయ సహకారాలతో ప్రతి మహిళ స్వయం ఉపాధి పొందేందుకు కృషి చేయాలన్నారు. జిల్లా మెప్మా అధికారి కె.మోహన్ కుమార్, మెప్మా సిఎంఎం జి.భ్రమరాంబ, సిఒలు ఎం.శ్రీదేవి, వి.ఉమాపార్వతి పాల్గొన్నారు.

వల్లభ స్వామికి రూ.2.59 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

తిరుపతి గ్రామంలోని శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం ఒకరోజు వివిధ టిక్కెట్ల ద్వారా రూ.1,90,760, అన్నదాన విరాళాల ద్వారా రూ.62,774, కేశఖండన ద్వారా రూ.6,400 ఆదాయం సమకూరిందని ఆలయ ఇఒ పులి నారాయణమూర్తి తెలిపారు. యాత్రికులకు ఉదయం పులిహోర ప్రసాదం, మధ్యాహ్నం మహా అన్నదానం నిర్వహించామన్నారు. ధర్మకర్తల మండల చైర్మన్ కర్రి వెంకట జగదీశ్వరరావు, ధర్మకర్తలు, ఎంపిటిసి కుంచే బుచ్చిరాజు, అర్చకులు పెద్దింటి నారాయణచార్యులు, పురుషోత్త మాచార్యులు, స్వచ్ఛంద సేవకులు అంజనీ కుమార్, మార్కండేయులు సేవలందించారన్నారు.

నల్లూరులో ఉపాధి హామీ గ్రామసభ



ఉపాధి హామీ పనులపై మాట్లాడుతున్న లోవరాజు

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

కపిలేశ్వరపురం మండలంలోని నల్లూరు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శని వారం ఉపాధి హామీ గ్రామ సభ నిర్వహించారు .గ్రామ సర్పంచ్ కురుపూడి ఉదయశ్రీ రాంబాబు అధ్యక్షతన జరిగిన ఉపాధి గ్రామ సభల్లో ఎన్ఆర్ఒజిఎస్ టిఎ.లోవరాజు మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామంలో చేపట్టవలసిన ఉపాది పనుల ప్రణాళిక నివేదికను గ్రామ సభలో వివరించారు.గ్రామంలో పనులు చేపట్టుటకు చర్చలు జరిపారు. గ్రామ పరిధిలో చేపట్టబోయే పంటబోదెలు, కాలువల పూడికతీత, చెరువులకు సంబంధించి 56 పనులు, గుర్తించినట్లు ఫీల్డ్ అసిస్టెంట్ పంపన శ్రీనివాస్ తెలిపారు గుర్తించిన పనుల వివరాలను ఉన్నతాధికారులకు నివేదించ నన్నట్లు లోవరాజు తెలిపారు. సమావేశంలో టెక్నికల్ అసిస్టెంట్ లోవరాజు, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాస్ సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, ఉపాధి మేట్లు, కూలీలు, రైతులు, తదితరులు, పాల్గొన్నారు.

పర్మినెంట్ చేయాలని మున్సిపల్ వర్కర్ల వినతి


వినతి పత్రం అందజేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మున్సిపాలిటీ పారిశుధ్య ఇంజినీరింగ్ విభాగాలలో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరుతూ శనివారం ఏపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసి మంగతాయారుకు వినతిపత్రం అందజేశారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి లేఖను మెయిల్ ద్వారా పంపించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు అప్పారావు, బాసిన భద్ర రావులు మాట్లాడారు. సిఎం వైఎస్.జగన్ అధికారంలోకి రాకముందు రాష్ట్రంలో ఉన్న కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ వర్కర్లను పర్మినెంట్ చేస్తానని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి ఆ హామీని నెరవేర్చలేదన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు సిరపరపు శ్రీనివాస్, వర్రే గిరిబాబు, అర్జి భద్రరావు, అప్పారావు పాల్గొన్నారు.